## క్లుప్తంగా

### మహిళలకు పలు అంశాలపై ఉచిత శిక్షణ

నిమ్మకూరు(పామర్రు): నిమ్మకూరు గ్రామంలోని నందమూరి తారక రామారావు నైపుణ్యాభివృద్ధి మహిళా సాధికారిత కేంద్రంలో పలు కోర్సులలో మహిళలకు ఉచితంగా ట్రైనింగ్ ఇవ్వనున్నట్లు జిల్లా మేనేజర్ డాక్టర్ ఎస్ జుబేదా పర్వీన్ పేర్కొన్నారు. శుక్రవారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ ప్రాంగణంలో మహిళలకు డొమెస్టిక్ డేటా ఎంట్రీ ఆపరేటర్, అసిస్టెంట్ బ్యూటీ థెరపిస్టు, జనరల్ డ్యూటీ అసిస్టెంట్, హ్యాండ్ ఎంబ్రాయిడరీ కోర్సులలో ఉచితంగా శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. 18–35 మధ్య వయసు కలిగి పదో తరగతి పాస్ అయిన మహిళలు ఈ శిక్షణకు అర్హులని పేర్కొన్నారు. అక్టోబర్ 6వ తేదీ నుంచి శిక్షణ తరగతులు ప్రారంభమవుతాయని తెలిపారు. ఆసక్తి ఉన్న మహిళలు మరిన్ని వివరాల కోసం 89195 75229, 83339 21343లో సంప్రదించాలని కోరారు.

### అన్నసమారాధన

గుడివాడ టౌన్ : స్థానిక 8వ వార్డు పుల్లలపాడు వంతెన వద్ద గల శ్రీ బాలగణపతి దేవస్థానం ప్రాంగణంలో శుక్రవారం భారీ అన్నసమారాధన జరిగింది. గణపతి నవరాత్రి మహోత్సవాలు ముగిసిన సందర్భంగా శాంతి నిమిత్తం ఈ అన్నసమారాధన నిర్వహించినట్లు ఆలయ అర్చకులు ఎస్. శివరామకృష్ణ తెలిపారు. తొలుత స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో శ్రీ లక్ష్మీ గణపతి యువజన సంఘం సభ్యులు పాల్గొన్నారు.

### ఏబీసీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించాలి



గుడ్లవల్లేరు: ఏపీలో జరుగుతున్న అసెంబ్లీ సమావేశంలో ఏబీసీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించాలని ఎమ్మార్పీఎస్ నాయకులు డిమాండ్ చేశారు. దీనిపై శుక్రవారం గుడ్లవల్లేరు తహసీల్దార్ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్ పి.శివకుమార్‌కు వినతిని అందించారు. ఏబీసీ వర్గీకరణ అమలు అయ్యేంతవరకు ఉద్యోగ నియామకాలు ఆపాలన్నారు. ఆటో డ్రైవర్లను కష్టాల నుంచి గట్టెక్కించటానికి రోజుకు ఐదు లీటర్ల ప్రకారం 50% సబ్సిడీతో ఇంధనం సరఫరా చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు సుధాకర్, ప్రశాంతి, పోలయ్య తదితరులు పాల్గొన్నారు.

### 22 నుంచి దేవీ నవరాత్రి మహోత్సవాలు

మండవల్లి: స్థానిక శ్రీభ్రమరాంబ సమేత మల్లేశ్వరస్వామి ఆలయంలో ఈ నెల 22 నుంచి అక్టోబర్ 2వ తేదీ వరకు ఉత్సవాలు నిర్వహించనున్నట్లు కార్య నిర్వహణాధికారి కె.దివ్యశ్రీ శుక్రవారం తెలిపారు. వచ్చే నెల 4వ తేదీన గ్రామోత్సవం, 6న అన్నసమారాధన జరుతాయని ఆమె పేర్కొన్నారు.

### డ్రైయిన్లకు మరమ్మతులు

మండవల్లి: పెరికేగూడెంలో సర్పంచ్ పెరుమాళ్ల పద్మ ఆధ్వర్యంలో పలు డ్రైయిన్లకు శుక్రవారం మరమ్మతులు చేశారు. సర్పంచ్ మాట్లాడుతూ ఇటీవల కురిసిన వర్షాలకు డ్రైయిన్లు పూడిపోవడంతో డ్రైయిన్లలో నీరు సక్రమంగా వెళ్లడం లేదన్నారు. దీంతో సమీపంలోని గృహాలకు ఎలాటి సమస్యలు లేకుండా డ్రైయిన్లను అభివృద్ధి చేయిస్తున్నట్లు తెలిపారు. వైఎస్సార్ సీపీ నాయకుడు పెరుమాళ్ల సత్యనారాయణ పాల్గొన్నారు.

### ఎంపీపీ స్కూల్ సందర్శన



మండవల్లి: మండవల్లి ప్రాథమిక పాఠశాల–2 (మోడల్ ప్రైమరీ స్కూల్)ను జిల్లా సమగ్ర శిక్ష అధికారులు అడిషనల్ ప్రాజెక్ట్ కో–ఆర్డినేటర్ కె.పంకజ్‌కుమార్, జిల్లా ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ సమగ్ర శిక్ష పి.రమణకుమారి శుక్రవారం సందర్శించారు. ఇటీవల రోడ్డు విస్తరణలో పోయిన ప్రహరీ గోడల నిర్మాణం గురించి అడిగి తెలుసుకున్నారు. త్వరలో నిర్మాణం చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. ఎంఈఓ–1 సీహెచ్ సురేష్, ఎంఈఓ–2 ఎస్.రత్నసునాథం, ఇంజినీరింగ్ అసిస్టెంట్ కిషోర్, హెచ్ఎం నిర్మలకుమారి, ఎ.ప్రకాష్‌బాబు పాల్గొన్నారు.

### మహిళా ఆరోగ్య సాధికారత ప్రధానం

కలిదిండి(కైకలూరు): స్వస్థ నారీ సశక్తి పరివార్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా కోరుకొల్లు పీహెచ్‌సీ వద్ద డాక్టర్ ధీరజ్‌కుమార్ అధ్యక్షతన ఆరోగ్య శిబిరం శుక్రవారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మహిళల ఆరోగ్య సాధికారత సాధనకు ఈ కార్యక్రమం దేశ వ్యాప్తంగా జరుగుతుందన్నారు. వైద్య శిబిరంలో రక్తపోటు, షుగరు, నోటి, రొమ్ము, గర్భాశయ క్యాన్సర్లను గుర్తించుటకు ప్రాథమిక పరీక్షలు చేస్తామన్నారు. ముఖ్య అతిథులుగా చిట్టూరి రవీంద్ర, కోకా శ్రీనివాసరావు, మురళీకృష్ణ, దుర్గాప్రసాద్, వేణు, మహంకాళి, బలరాం, కనకయ్య, పుల్లేశ్వరరావు, జగన్‌మోహన్ గుప్తా పాల్గొన్నారు.

# ప్రైవేటుపరం ఆలోచనపై ఉప్పొంగిన నిరసన



ప్రభుత్వ మెడికల్ కళాశాలలను ప్రైవేటుపరం చేసేందుకు కూటమి ప్రభుత్వ కుట్రలను తిప్పికొట్టేందుకు వైఎస్సార్ సీపీ చేపట్టిన నిరసన ఉప్పొంగిన ఉత్సాహంతో సాగింది. వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన పిలుపు మేరకు పార్టీ కృష్ణా జిల్లా అధ్యక్షుడు పేర్ని వెంకట్రామయ్య (నాని) నేతృత్వంలో చలో మెడికల్ కళాశాల కార్యక్రమం శుక్రవారం చేపట్టారు. ఉదయం నుంచి బందరు మెడికల్ కళాశాలకు వెళ్లే రహదారుల్లో బారికేడ్లను పోలీసులు ఏర్పాటు చేశారు. వందల సంఖ్యలో పోలీసులు మోహరించారు. అయినప్పటికీ వైఎస్సార్ సీపీ శ్రేణులు, విద్యార్థులు తాము ఆగేది లేదంటూ ముందుకు సాగారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ







## భారీ ర్యాలీగా 'చలో మచిలీపట్నం'



పామర్రు నుంచి ర్యాలీగా బయలు దేరిన కైలే అనిల్‌కుమార్, వైఎస్సార్ సీపీ శ్రేణులు



పామర్రు నుంచి కార్లలో ర్యాలీగా వెళుతు వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు

పామర్రు: వైఎస్సార్ సీపీ అధ్యక్షులు వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు ప్రభుత్వ మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణను నిరసిస్తూ 'చలో మచిలీపట్నం' కార్యక్రమానికి శుక్రవారం పామర్రు నుంచి మాజీ ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్ ఆధ్వర్యంలో అధిక సంఖ్యలో పార్టీ శ్రేణులు వాహనాలతో భారీ ర్యాలీగా వెళ్లారు. నియోజకవర్గంలోని ఐదు మండలాల నుంచి వందలాదిగా పార్టీ శ్రేణులు పామర్రు కార్యాలయం వద్దకు చేరుకున్నారు. అక్కడి నుంచి అనిల్‌కుమార్ ఆధ్వర్యంలో మచిలీపట్నం బయలు దేరారు. ఈ సందర్భంగా కైలే అనిల్ కుమార్ మాట్లాడుతూ ప్రభుత్వ వైద్య కళాశాలలను ప్రైవేటు సంస్థలకు అప్పగించడం దారుణమన్నారు. దీని వలన పేద, మధ్య తరగతి వర్గాలకు వైద్యం, వైద్య విద్యను దూరం చేయడమే అని ప్రభుత్వ తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. చంద్రబాబు ప్రభుత్వం ప్రజారోగ్యాన్ని గాలికి వదిలేసిందన్నారు. వైద్య కళాశాలలను ప్రైవేటు పరం చేస్తామనే నిర్ణయాన్ని ప్రభుత్వం వెంటనే వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. పేదల గురించి ఆలోచించే నైజం చంద్రబాబుకు లేదన్నారు. సంపద సృష్టిస్తానని అధికారంలోకి వచ్చిన చంద్రబాబు తన కార్పొరేట్లకు, బంధువులకు సంపద సృష్టించే పనిలో పడ్డారన్నారు. వైద్య కళాశాలలను ప్రభుత్వ పరం చేసే వరకు పోరాటాలు చేస్తామన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ దాసరి అశోక్‌కుమార్, జెడ్పీటీసీ సభ్యుడు జొన్నల రామ్మోహన్‌రెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు నడకుదిటి రాజేంద్ర, కళ్లం వెంకటేశ్వరరెడ్డి, తాడిశెట్టి శ్రీనివాసరావు, గవాస్కరరాజు, రమేష్, తిరుమలశెట్టి వాసు, కాకర్ల వెంకటేశ్వరరావు, పెయ్యల రాజు, రాజేష్ తదితర ఐదు మండలాలకు చెందిన పార్టీ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## వీఆర్‌ఏల సమస్యలు పరిష్కరించండి



మొవ్వలో ధర్నా చేస్తున్న వీఆర్‌ఏలు



ముదినేపల్లిలో వీఆర్‌ఏలు ధర్నా

గుడ్లవల్లేరు: మండలంలోని వీఆర్‌ఏల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ రెండు రోజులుగా స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్నారు. వీఆర్‌ఏలకు పే స్కేలు అమలు చేయాలని వీఆర్‌ఏల మండల సంఘ అధ్యక్షుడు జుజ్జువరపు యేసేబు శుక్రవారం డిమాండ్ చేశారు. అర్హులైన వీఆర్‌ఏలకు వీఆర్వో, అటెండర్, వాచ్‌మెన్, డ్రైవర్లుగా ఉద్యోగోన్నతులు కల్పించాలని కోరారు. ఆ సంఘ ఉపాధ్యక్షుడు ఉడుముల రవి కిరణ్ పాల్గొన్నారు.

**ముదినేపల్లిలో..**

ముదినేపల్లి రూరల్: తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ మండలంలోని గ్రామ రెవెన్యూ సహాయకులు స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట శుక్రవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘ నాయకులు బలరాం, వసంతరావు, రాజేష్ మాట్లాడారు. వీఆర్‌ఏలు సురేష్, ప్రసాద్, నూర్జహాన్, శివపార్వతీ, భవానీ, గంగాధరరావు, అన్నామణి, సునీత, సాయి, ముసలయ్య, కోటేశ్వరరావు, సుమతి, చంద్రకాంత్, హుస్సేన్ పాల్గొన్నారు.

**అటెండర్ డ్యూటీలను రద్దు చేయాలి**

మొవ్వ: వీఆర్‌ఏలతో ప్రస్తుతం చేయిస్తున్న నైట్ వాచ్‌మెన్, అటెండర్ డ్యూటీలను రద్దు చేయాలని వీఆర్‌ఏలు డిమాండ్ చేశారు. తమ సమస్యల పరిష్కారం కోసం శుక్రవారం మొవ్వ తహసీల్దార్ కార్యాలయం వద్ద వీఆర్‌ఏలు ధర్నా చేశారు. కార్యక్రమంలో వీఆర్‌ఏల సంఘం మండల అధ్యక్షుడు పెడసనగంటి రాజేష్ పాల్గొన్నారు.

### పరిసరాలు పరిశుభ్రంగా ఉంచండి

గుడివాడ టౌన్ : ప్రతి ఒక్కరూ తమ పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచడం బాధ్యతగా స్వీకరించాలని మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ పి. శ్రీనివాసరావు అన్నారు. శుక్రవారం స్థానిక ఆర్టీసీ బస్టాండ్ పరిసర ప్రాంతాల్లో మాస్ క్లీనింగ్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వచ్ఛత–హి–సేవా 2025లో భాగంగా కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచాల్సిన బాధ్యత ప్రతి పౌరుడిపై ఉందన్నారు.

### నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

గుడివాడ టౌన్ : పట్టణంలో విద్యుత్ లైన్ల మరమ్మతులు కారణంగా శనివారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ఎలక్ట్రికల్ ఈఈ జి.బి. శ్రీనివాసరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. శనివారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు మందపాడు పరిసర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు పేర్కొన్నారు. వినియోగదారులు ఈ విషయాన్ని గమనించి సహకరించాలని కోరారు.

### మహిళలకు వైద్య పరీక్షలు



ముదినేపల్లి రూరల్: స్వస్థ నారీ సశక్తి పరివార్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా మండలంలోని అల్లూరు జెడ్పీ హైస్కూల్లో మహిళలకు శుక్రవారం వైద్య పరీక్షలు నిర్వహించారు. వైఎస్సార్ సీపీ నాయకుడు, సర్పంచ్ శీలం రామకృష్ణ, కూటమి నాయకులు దావు నాగరాజు, రెడ్డి రాధిక మాట్లాడారు. మహిళల్లో తరచూ ఎదురయ్యే ఆరోగ్య సమస్యలు పరిష్కరించుకునేందుకు పోషకాహారం తీసుకోవడంతో పాటు వైద్యుల సలహాలు పాటించాలన్నారు. కార్యక్రమంలో వైద్యాధికారి కె.రాణి, సీహెచ్‌ఓ ఎస్‌ముత్తయ్య పాల్గొన్నారు.

## గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవాలి



పెదమద్దాలిలో మాట్లాడుతున్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్ విజయకుమారి



వానపాములలో ప్రతిజ్ఞ చేయిస్తున్న సూపర్‌వైజర్ శివనాగమణి



గుడ్లవల్లేరులో పౌష్టికాహారంపై అవగాహన

పెదమద్దాలి(పామర్రు): తక్కువ ఖర్చుతో ఎక్కువ పోషక విలువలు కలిగిన పౌష్టికాహారం తీసుకోవాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఎస్.విజయకుమారి అన్నారు. మండలంలోని పెదమద్దాలి సచివాలయంలో అంగన్‌వాడీ సెంటర్–6 పరిధిలో అవగాహన కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలకు పోషక విలువలుగల ఆహారం అందించడంలో పురుషులు కీలక పాత్ర అందించాలన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

**పౌష్టికాహారంతో వ్యాధులు దూరం**

గుడ్లవల్లేరు: పౌష్టికాహారం తీసుకోవడం ద్వారా పలు వ్యాధులు దూరమవుతాయని ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు డీ.మేరీ, నసీర్ ఉన్నిసా అన్నారు. 8వ రాష్ట్రీయ పోషణ మాసంలో భాగంగా మండలంలోని డోకిపర్రు సెక్టార్ పరిధిలో చిత్రం అంగన్‌వాడీ కేంద్రం వద్ద, కవుతరం సెక్టార్‌లోని వడ్లమన్నాడు అంగన్‌వాడీ కేంద్రంలో గుడ్లవల్లేరు సెక్టార్‌లోని గుడ్లవల్లేరు అంగన్‌వాడీ కేంద్రాల్లో పోషకాహారంపై తల్లులకు, పిల్లలకు అవగాహన కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. మాతా శిశు మరణాలు తగ్గించేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమాల్లో ఏఎన్ఎంలు, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

**వానపాములలో..**

వానపాముల(పెదపారుపూడి): పోషక విలువలు కలిగిన ఆహారం గర్భిణులు తీసుకుంటే రక్త హీనత సమస్యను అధిగమించవచ్చని వెంట్రప్రగడ ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఎం. శివనాగమణి అన్నారు. మండలంలోని వానపాముల గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో శుక్రవారం పోషకాహార మాసోత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగా సూపర్‌వైజర్ అంగన్‌వాడీ కార్యకర్తలతో పోషకాహారంపై అవగాహ కల్పించే విషయంపై ప్రతిజ్ఞ చేయించారు. అదేవిధంగా చినపారుపూడి గ్రామంలో పెదపారుపూడి సెక్టార్ సూపర్‌వైజర్ అరుణకుమారి ఆధ్వర్యంలో పోషకాహార మాసోత్సవాలను నిర్వహించారు.

## ప్రతిభా పోటీల్లో విద్యార్థులకు పతకాలు



గుడ్లవల్లేరులో విజేతలతో ప్రిన్సిపాల్ కుంజుమన్

గుడివాడ టౌన్ : రోటరీక్లబ్ ఆఫ్ గుడివాడ నిర్వహించిన ప్రతిభా పోటీల్లో తమ విద్యార్థులు 31 పతకాలు సాధించినట్లు విద్యాలయ డైరెక్టర్ బొప్పన విజయభాస్కర్ తెలిపారు. శుక్రవారం పాఠశాల ఆవరణలో విద్యార్థులను అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోటరీక్లబ్ గుడివాడ ఆధ్వర్యంలో 10 రోజులుగా నిర్వహించిన పలు ప్రతిభా పోటీల్లో తమ విద్యార్థులు పతకాలు సాధించారని తెలిపారు. విద్యార్థులను పాఠశాల డైరెక్టర్ బొప్పన శాంతి, ఉపాధ్యాయులు అభినందించారు.

**ప్రతిభా పోటీల్లో గౌతమ్ విద్యార్థులు**

గుడివాడ టౌన్: విద్యతో పాటు ఇతర కార్యక్రమాల్లో కూడా తమ విద్యార్థులు ప్రతిభను ప్రదర్శిస్తున్నారని కేకేఆర్ గౌతమ్స్ ప్రిన్సిపాల్ పి.లక్ష్మీ ప్రసాద్ తెలిపారు. శుక్రవారం పాఠశాల ఆవరణలో పలు పోటీల్ల ప్రతిభను ప్రదర్శించి పతకాలు సాధించిన విద్యార్థులను అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోటరీక్లబ్ ఆఫ్ గుడివాడ ఈనెల 3 నుంచి 18వ తేదీ వరకు నిర్వహించిన వివిధ పోటీల్లో తమ విద్యార్థులు 74 మంది ప్రతిభను ప్రదర్శించి పతకాలు సాధించారని తెలిపారు. కార్యక్రమంలో స్కూల్ ప్రిన్సిపాల్స్ పి. సత్యారామ్, జ్యోతి, ప్రశాంతి పాల్గొన్నారు.

**రోటరీక్లబ్ ఆధ్వర్యంలో..**

గుడివాడ టౌన్ : రోటరీక్లబ్ ఆఫ్ గుడివాడ ఆధ్వర్యంలో నిర్వహించిన యూత్ ఫెస్టివల్ 2025లో తమ విద్యార్థులు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు సాధించినట్లు విద్యావికాస్ డైరెక్టర్ కొమ్మినేని సాంబశివరావు తెలిపారు. శుక్రవారం పతకాలు సాధించిన విద్యార్థులను ఆయన అభినందించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం సీహెచ్ నాగమల్లేశ్వరరావు, వ్యాయామ ఉపాధ్యాయుడు సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

**గుడ్లవల్లేరులో..**

గుడ్లవల్లేరు: స్థానిక ఎ.ఎ.ఎన్.ఎం అండ్ వి.వి.ఆర్.ఎస్.ఆర్ గుడ్లవల్లేరు(ఇం.మీ) హైస్కూల్ విద్యార్థులు వివిధ పోటీల్లో బహుమతులను పొందారు. ఈ విషయాన్ని ప్రిన్సిపాల్ కుంజుమన్ విలేకరులకు శుక్రవారం తెలిపారు. ఈ నెల 3నుంచి 18వ తేదీ వరకు రోటరీ క్లబ్ గుడివాడ వారు నిర్వహించిన యూత్ ఫెస్టివల్లో భాగంగా వివిధ విభాగాలకు సంబంధించిన పోటీలు నిర్వహించారన్నారు. తమ హైస్కూల్ విద్యార్థులు శాస్త్రీయ నృత్యంలో ప్రథమ బహుమతి, తెలుగు వ్యాసరచన, సీనియర్ ఫ్యాన్సీ డ్రెస్, జూనియర్స్ శాస్త్రీయ నృత్యం, సీనియర్ ఫోక్ డ్యాన్స్‌లలో ద్వితీయ స్థానం, ఇంగ్లిష్, తెలుగు వక్తృత్వంలో తృతీయ స్థానం స్పాట్ పెయింటింగ్, సీనియర్స్ ఫ్యాన్సీ డ్రెస్సులలో కన్సోలేషన్ ప్రైజ్‌లు కైవసం చేసుకున్నారని తెలిపారు. బహుమతులు సాధించిన విద్యార్థులను, వారికి శిక్షణను ఇచ్చిన ఉపాధ్యాయులను ప్రిన్సిపాల్‌తో పాటు డైరెక్టర్ ఎన్.శ్రీనివాసమూర్తి, పాఠశాల యాజమాన్యం అభినందించారు.

### సేవా పర్వ్–2025 పోస్టర్ ఆవిష్కరణ



కైకలూరు: సేవా పర్వ్– 2025 పోస్టర్‌ను కైకలూరు వైవీఎన్నార్ ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో ప్రిన్సిపాల్ వై.శ్రీలత శుక్రవారం ఆవిష్కరించారు. కాలేజీలో యూత్ అడ్వాన్స్‌మెంట్, టూరిజం, కల్చరల్ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. కో–ఆర్డినేటర్ హరిప్రసాద్ మాట్లాడుతూ వికసిత్ భారత్–2025పై అవగాహన కలిగించడానికి ఈ నెల 23 వరకు విద్యార్థులకు పలు పోటీలను నిర్వహించి బహుమతులు అందిస్తామన్నారు. అనంతరం ఈ నెల 11న స్వామి వివేకానంద అద్వితీయ చికాగో ఉపన్యాస పోటీల్లో విశాఖపట్నం రామకృష్ణ మిషన్ ద్వారా నాల్గో స్థానం పొందిన బీఎస్సీ జువాలజీ విద్యార్థి ఎస్.దీపకను ప్రిన్సిపాల్ అభినందించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ అడపా కేదారి, అధ్యాపకులు వేదాంతం, వీర్రాజు పాల్గొన్నారు.

## గ్రామ స్థాయిలో పార్టీని బలోపేతం చేయండి



వైఎస్సార్ సీపీ పెంచికలమర్రు గ్రామ కమిటీని అభినందిస్తున్న డీఎన్నార్

కైకలూరు: గ్రామ స్థాయిలో వైఎస్సార్ సీపీని బలోపేతం చేయడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పార్టీ ఏలూరు జిల్లా అధ్యక్షుడు దూలం నాగేశ్వరరావు (డీఎన్నార్) పేర్కొన్నారు. కైకలూరు పార్టీ కార్యాలయంలో పెంచికలమర్రు గ్రామ కమిటీని శుక్రవారం ఎంపిక చేశారు. గ్రామ అధ్యక్షుడిగా ఘంటసాల నీలవర్ధనరావు, ఉపాధ్యక్షుడిగా ముంగర నరసింహమూర్తితో పాటు పలు పదవుల్లో మరో 17 మందిని డీఎన్నార్ అభినందించారు. కార్యక్రమంలో పెంచికలమర్రు సర్పంచ్, జిల్లా ఆర్గనైజేషనల్ సెక్రటరీ జయమంగళ కాసులు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

### ఘనంగా ఉరుసు మహోత్సవం



లక్ష్మీపురం(పెదపారుపూడి): మండలంలోని వెంట్రప్రగడ శివారు లక్ష్మీపురంలోని హజరత్ కరిముల్లా ఉరుసు మహోత్సవం శుక్రవారం రాత్రి ఘనంగా నిర్వహించారు. బాబా దర్గాలో ముస్లింలు ప్రత్యేక నమాజ్ చేశారు. బాబా దర్గాలో బాబాకు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.



## 23న మెగా మెడికల్ క్యాంప్

కైకలూరు: స్వస్థ నారీ సశక్తి పరివార్ అభియాన్‌లో భాగంగా ఈ నెల 23న మంగళవారం ఉదయం తొమ్మిది గంటల నుంచి కై కలూరు కమ్యూనిటీ హెల్త్ సెంటర్ (సీహెచ్‌సీ)లో మెగా మెడికల్ క్యాంప్ నిర్వహించనున్నట్లు సూపరింటెండెంట్ ఎ.శ్రీనివాసరావు శుక్రవారం తెలిపారు. ఉచిత వైద్య శిబిరంలో మహిళలు, గర్భిణులు, చంటి పిల్లలు, చర్మ, కంటి, చెవి, ముక్కు, గొంతు, మానసిక వ్యాధులు, క్యాన్సర్, దంత, షుగర్, బీపీ వంటి పరీక్షలు చేస్తారని పేర్కొన్నారు. శిబిరానికి వచ్చే వారు ఆధార్ కార్డు, ఫోన్ తప్పనిసరిగా తీసుకురావాలని కోరారు.

## సమస్యలు పరిష్కరించే సామర్థ్యం ఉండాలి




గంగూరులో ప్రసంగిస్తున్న డాక్టర్ చంద్రశేఖర్ బుద్ధ

పెనమలూరు:విద్యార్థులు సమస్యలు పరిష్కరించే సామర్థ్యంతో ఉండాలని భారత ప్రభుత్వ విద్యా మంత్రిత్వ శాఖ ఏఐసీటీఈ చీఫ్ కోఆర్డినేటింగ్ ఆఫీసర్, అనువాదిని ఏఐ సీఈవో డాక్టర్ చంద్రశేఖర్ బుద్ధ అన్నారు. గంగూరు ధనేకుల ఇంజినీరింగ్ కాలేజీలో శుక్రవారం ఇంటర్నేషనల్ కాన్ఫరెన్స్ ఆన్ ఇన్నోవేషన్ ఎమర్జింగ్ టెక్నాలజీస్ అనే అంశంపై జాతీయస్థాయిలో జరిగిన సదస్సులో ఆయన పాల్గొని ప్రసంగించారు. విద్యార్థులను ప్రోత్సహించటానికి స్టార్టప్ కంపెనీలు ప్రారంభించాలని సూచించారు. విద్యార్థులు వ్యవసాయ ఆధారిత స్టార్టప్‌లు, రైతులు సమస్యలు, ఆహార ఉత్పత్తులు పెంచే విధంగా కృషి చేయాలన్నారు. ఏఎన్‌టీయు విజయనగరం ఉపకులపతి డాక్టర్ డి.రాజ్యలక్ష్మి మాట్లాడుతూ విద్యార్థులు సృజనాత్మకత, సహకార పరిశోధనల పై దృష్టి పెట్టాలన్నారు. జాతీయ స్థాయిలో 308 పరిశోధన పత్రాలు సమర్పించారు. ఈ కార్యక్రమంలో యూఎస్‌కు చెందిన డేటావ్యాలీ సీఈవో చలమలశెట్టి పవన్, డైరెక్టర్ డీకెఆర్‌కె.రవి ప్రసాద్, ప్రిన్సిపాల్ డాక్టర్ కడియాల రవి, డీన్ డాక్టర్ రాజేష్ గోగినేని, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

### ఉత్సాహంగా క్రీడా పోటీలు



మొవ్వ: స్థానిక శ్రీ మండవ కనకయ్య జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల్లో నిర్వహించిన మండల స్థాయిలో బాలికల జూనియర్, సీనియర్ క్రీడా పోటీలు ఉత్సాహ వాతావరణంలో సాగాయి. శుక్రవారం నిర్వహించిన కబడ్డీ, ఖోఖో సీనియర్ విభాగంలో మొవ్వ హైస్కూల్ విద్యార్థులు, జూనియర్స్ కబడ్డీ, ఖో–ఖో విభాగాల్లో కాజ హైస్కూల్ విద్యార్థినులు విన్నర్స్‌గా నిలిచారు. వాలీబాల్‌లో సీనియర్స్ విన్నర్స్‌గా పెడసనగల్లు హైస్కూలు, రన్నర్స్‌గా మొవ్వ హైస్కూలు విద్యార్థులు నిలిచారని మొవ్వ పీడీ మనోహరి తెలిపారు. త్వరలో నిర్వహించే డివిజన్ స్థాయిలో పాల్గొనే విద్యార్థులను ఈ పోటీల ద్వారా ఎంపిక చేసినట్లు పేర్కొన్నారు. పీఈటీలు టీవీ దానారావు, శివ పాల్గొన్నారు.